
సాక్షి
అనంతపురం

గురువారం । 6 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

8న జాతీయ లోక్‌అదాలత్

- అదాలత్ తీర్పు 'సుప్రీం'
- ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ లోక్ అదాలత్ ఉంటుందన్నారు. గత లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం పరంగా రాష్ట్రంలోనే జిల్లా 9వ స్థానంలో నిలిచిందని, ఈ సారి ఆ స్థానాన్ని మెరుగుపరచాలన్నారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో 6,294 కేసులను పరిష్కరించడానికి ఆయా బెంచ్‌లు కృషి చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా నాగమణి

అనంతపురం సెంట్రల్: జిల్లా ఐసీడీఎస్ పీడీగా ఎం.నాగమణి నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లాల్లో మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం సీడీపీ ఓగా పనిచేస్తున్న ఎం. నాగమణికి పదోన్నతి కల్పించి జిల్లా పీడీగా నియమించారు. శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీగా తాడిపత్రి సీడీపీఓ టి. శ్రీదేవికి అదనపు బాధ్యతలు (ఆన్‌డ్యూటీ) అప్పగించారు.

ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైళ్లకూ బ్రేకులు!

గుంతకల్లు: హుబ్లీ–తిరుపతి మధ్య గుంతకల్లు జంక్షన్ మీదుగా తిరుగుతున్న ఇంటర్ సిటీ ప్యాసింజర్ రద్దును కూడా ఈ నెల 31 వరకు పొడిగించారు. ఈ మేరకు బుధవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి–హుబ్లీ (57401) ప్యాసింజర్ ఈ నెల 30 వరకు, హుబ్లీ–తిరుపతి ప్యాసింజర్ (57402) ప్యాసింజర్ రద్దును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు వివరించారు. కాగా, కుంభమేళాకు తరలించిన పలు ప్యాసింజర్ రైళ్లు ఈ నెలాఖరు వరకూ రాకపోకలు సాగించవని ఇదివరకే అధికారులు ప్రకటించారు.

వాహనం ఢీకొని పాత్రికేయుడికి తీవ్రగాయాలు



గాయపడిన శ్రీనివాసులుగౌడ్

పెద్దవడుగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో యాడికి మండల 'సాక్షి' విలేకరి శ్రీనివాసులు గౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన శ్రీనివాసులు గౌడ్ బుధవారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంలో గుత్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో తనను కలసిన పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లికి చెందిన వృద్ధుడు లక్ష్మీరెడ్డిని వాహనంపై ఎక్కించుకుని వెళుతుండగా... పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకు దూసుకెళ్లాడు. ప్రమాదంలో శ్రీనివాసులు గౌడ్, లక్ష్మీరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఎ.తిమ్మాపురం గ్రామానికి చెందిన సీపీఐ నేత వెంకట్రాముడు యాదవ్, పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీనివాసులుగౌడ్‌ను కర్నూలులోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, ప్రమాద స్థలానికి అరగంట ఆలస్యంగా చేరుకున్న 108 సిబ్బంది అక్కడ తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులుగౌడ్‌ను చూడగానే అంబులెన్స్‌లోకి ఎక్కించి ప్రేక్షక పాత్ర పోషించడాన్ని స్థానికులు తప్పుబట్టారు. కనీసం స్ట్రెచర్ కూడా తీయకుండా అది పని చేయడం లేదంటూ బుకాయించడాన్ని మండల సీపీఐ కార్యదర్శి వెంకట్రాముడు యాదవ్ ఖండించారు. క్షతగాత్రుల విషయంలో 108 అంబులెన్స్ సిబ్బంది వ్యవహరించిన తీరును ఆయన ఆక్షేపించారు.

కరెంటు మీటర్‌కు.. సమ్మర్ హీట్

- మండుతున్న ఎండలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



75 వీరాపురం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్



బోర్ల కింద సాగుచేసిన వరి

రాయదుర్గం: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే భగభగ మండిపోతున్నాడు. జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వైపు మొగ్గు చూపుతున్నారు. రోజంతా ఆయా ఉపకరణాలు నడుస్తూనే ఉంటున్నాయి. మరోవైపు జిల్లాలో వ్యవసాయ బోర్లు ఎక్కువైపోయాయి. జిల్లావ్యాప్తంగా 1,84,542 లక్షల వ్యవసాయ కలెక్షన్ల కింద వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి ఇతర పంటల సాగుకు భూగర్భ జలాన్ని తోడేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి, పగలు మోటార్లు ఆన్‌లోనే ఉంటుండటంతో విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కూడా ఊహించని రీతిలో ఎగబాకింది. జనవరి ఆరంభంలో 522 మిలియన్ యూనిట్లు ఉన్న గరిష్ట విద్యుత్ డిమాండ్.. ప్రస్తుతం 626 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఈ క్రమంలో వచ్చే రెండు నెలలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అవసరాలపై ఆ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. గరిష్టంగా 707 మిలియన్ యూనిట్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని, ఆ మేరకు డిస్కమ్‌ల నుంచి దిగుమతి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

అల్లాడిపోతున్న సామాన్యులు..

కరెంటు వినియోగానికి అనుగుణంగా బిల్లులు కూడా పెరుగుతుండటంతో సామాన్యుల గుండెలు గు'బిల్లు' మంటున్నాయి. ఒకవైపు ఉక్కపోత.. మరోవైపు పెరిగిన బిల్లులతో అల్లాడిపోతున్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు.. రాష్ట్రంలో ఏకంగా రూ.15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారు. సర్దుబాటు చార్జీల పేరుతో బలంగా బాదారు. ఈ క్రమంలోనే ఎండల తాకిడికి విద్యుత్ వినియోగం ఎక్కువై... ఆ మేర బిల్లు కూడా పెరగడంతో జనం ఘొల్లుమంటున్నారు.

పొదుపుగా వాడాలి..

వేసవి నేపథ్యంలో విద్యుత్ పొదుపుపై అధికారులు ప్రచారం చేస్తున్నారు. అధునాతన ఎల్ఈడీ లైట్ల వినియోగంతో చాలా వరకూ ఆదా చేయవచ్చని సూచిస్తున్నారు. మూడు లేదా నాలుగు రేటెడ్ గృహ ఉపకరణాలు వాడాలని, అవసరం లేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు, టీవీలు, కూలర్లు, ఏసీలు ఆపేయాలని, ఉదయం వేళ లైట్ల వినియోగం తగ్గించుకోవాలంటున్నారు. వ్యవసాయ పంటలకు నేరుగా తడులు కాకుండా బిందు, తుంపర విధానాల్లో నీరు అందిస్తే మేలని చెబుతున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నాం. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకునేలా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. పగటి పూట కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు, లైట్ల వాడకం తగ్గించాలి. అన్ని రకాల విద్యుత్ సర్వీసు వినియోగదారులు ఈ కొన్నాళ్లు జాగ్రత్తలు పాటించాలి.

– శేషాద్రిశేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

గృహ	6,17,598
వాణిజ్య	72,061
పరిశ్రమలు	3,530
ప్రభుత్వ కార్యాలయాలు	12,803
వ్యవసాయ	1,84,542
మొత్తం	8,90,534
ప్రస్తుతం విద్యుత్ గరిష్ట డిమాండ్	626 మిలియన్ యూనిట్లు
వేసవిలో అంచనా మొత్తం	707 మిలియన్ యూనిట్లు

ప్రతి తప్పునూ సరిదిద్దుతాం

- సీనియార్టీ జాబితాపై ఆందోళన చెందాల్సిన పనిలేదు
- పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్, చిత్రంలో డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల సీనియార్టీ జాబితాలో ప్రతి తప్పునూ సరిదిద్దుతామని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ కృష్ణయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని కేడర్ల టీచర్ల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో శాశ్వతంగా సీనియార్టీ జాబితాలు తయారు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 15,059 మంది టీచర్లు పని చేస్తున్నారన్నారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు 6,849 మంది, ఎస్జీటీలు 7,307 మంది, లాంగ్వేజ్ పండిట్లు 117 మంది, పీఈటీలు 60 మంది, పీఎస్‌హెచ్‌ఎంలు 340, గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు 386 మంది ఉన్నారన్నారు. వీరికి సంబంధించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాలను విడుదల చేశామన్నారు. డీఈఓ బ్లాగ్‌లోని జాబితాలను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో తెలియజేయాలని సూచించారు. రోజూ సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈనెల 10 వరకు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ప్రతి ఫిర్యాదునూ పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొత్త విధానంతో భవిష్యత్తులో సీనియార్టీ బదిలీలు, పదోన్నతుల సమయంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని ఆర్జేడీ స్పష్టం చేశారు.

సేవలతో ప్రజా మన్ననలు పొందాలి



విద్యార్థినికి స్నాతకోత్సవ పట్టా అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



స్నాతకోత్సవంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

- వైద్య విద్యార్థులకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు
- ఘనంగా అనంతపురం వైద్య కళాశాల 2కే 19 బ్యాచ్ స్నాతకోత్సవం

అనంతపురం మెడికల్: ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణంలో 2కే19 బ్యాచ్ స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్ కుమార్ హాజరై ముందుగా జ్యోతిప్రజ్వలన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించేందుకు యువత ముందుకురావాలన్నారు. తాను వైద్యునిగా గ్రామీణ ప్రాంతాల్లో అందించిన సేవలు, కలెక్టర్‌గా సాధించిన విజయాలను పంచుకున్నారు. ఐఏఎస్ సాధించాలన్న ఆశ ఎవరికైనా ఉంటే ఇష్టంతో చదవాలని సూచించారు. ప్రజలకు విలువలతో కూడిన వైద్యం అందించడం ముఖ్యమన్నారు. గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అనంతపురం వైద్య కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. చాలా మంది ఇక్కడ విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు మెమొంటోలు, పట్టాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ హెచ్చరిక
- విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసుల నోటీసుల నేపథ్యంలో విచారణకు బయలుదేరి వెళ్లిన మాధవ్



మీడియాతో మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: అక్రమ అరెస్టులతో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ హెచ్చరించారు. అత్యాచార ఘటనలో బాధితుల పేర్లు బహిరంగంగా ప్రకటించారనే ఫిర్యాదుతో విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు గోరంట్ల మాధవ్‌కు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బుధవారం విచారణకు హాజరుకావాల్సి ఉండగా...ఉదయం బయలుదేరి వెళ్లారు. మాధవ్ ఇంటివద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాధవ్ మాట్లాడుతూ... ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఆలస్యంగా వస్తానని పోలీసులకు ముందస్తు సమాచారం అందించానని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. కూర్చుంటే కేసు, లేస్తే కేసు, విమర్శిస్తే కేసులు నమోదు చేస్తూ పౌరుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితులు కొనసాగితే కులాలు,మతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు, విప్లవం తప్పదని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ పరామర్శ..

గోరంట్ల మాధవ్‌ను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. మాజీ ఎంపీ రంగయ్య మాట్లాడుతూ...రూల్ ఆఫ్ లా అనేది అందరికీ ఒకేలా ఉండాలన్నారు. పార్టీ మారినంత మాత్రాన ప్రభుత్వం మారకూడదన్నారు. ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్న తీరు మంచిగా లేదన్నారు. గోరంట్ల మాధవ్‌కు ఏ విధంగా నోటీసులు ఇచ్చారో గతంలో బాధితుల పేర్లు వెల్లడించిన వారందరికీ ఇదే రకంగా నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఇప్పుడు చట్టం తన పని తను ఎలాగా చేస్తోందో రానున్న రోజుల్లోనూ అలాగే చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెడుతూ పార్టీ కేడర్‌ను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం గురించి పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల అరెస్ట్‌పై ఫోకస్ పెట్టారన్నారు. ఇవి ఎన్నో రోజులు సాగవన్నారు. అనంతరం గోరంట్ల మాధవ్ పెద్ద ఎత్తున కాన్వాయ్‌తో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్



అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు నాయుడుపై రాజద్రోహం కింద కేసు నమోదు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చిత్తూరు పర్యటనలో చంద్రబాబు నాయుడు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని వ్యాఖ్యానించడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. సీఎంగా, ప్రతిపక్ష నేతగా సుదీర్ఘ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజల పట్ల వివక్ష చూపడం ఎంత వరకు న్యాయమన్నారు. సీఎం అనే వ్యక్తి అందరినీ సమాన ధోరణితో చూడాలని.. కేవలం కొన్ని పార్టీలకు మాత్రమే పథకాలు ఇవ్వాలని మాట్లాడటం దారుణమన్నారు. మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అధికారులు, నాయకులపై పోలీసులతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని.. రానున్న రోజుల్లో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతారన్నారు.

తారస్థాయికి ఖాకీల వేధింపులు

- ప్రసన్నాయపల్లి మహానంద రెడ్డిని ముప్పుతిప్పలు పెడుతున్న వైనం
- తరచూ ఇంట్లో సోదాలు
- సీఐ రాజేంద్రనాథ్ తీరుపై విమర్శలు



వన్‌టౌన్ స్టేషన్‌లో మహానంద రెడ్డి

అనంతపురం: రాప్తాడు పంచాయతీ పరిధిలోని ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానంద రెడ్డిపై పోలీసుల వేధింపులు తారస్థాయికి చేరాయి. తరచూ పోలీసుస్టేషన్‌కు పిలవడం, ముందస్తు సమాచారం లేకుండానే నేరుగా ఇంట్లోకి వెళ్లి సోదాలు చేయడం వంటి ఘటనలతో కుటుంబ సభ్యులను భయాందోళనకు గురి చేస్తున్నారు. మహానందరెడ్డి సోదరుడు భూమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డిని ప్రత్యర్థులు 2015 ఏప్రిల్ 29న రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలోనే దారుణంగా హత్య చేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ సమయంలో రాప్తాడు ఎంపీపీగా ఉన్నారు. అప్పట్లో దగ్గుపాటి కారును శివ ప్రసాదరెడ్డి హత్య కేసులోని నిందితులు వాడినట్లు తేలింది. ఈ క్రమంలో దగ్గుపాటి, మహానందరెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి.

సీఐ స్వామి భక్తి!

ఎమ్మెల్యే దగ్గుపాటి అండతో అనంతపురం వన్‌టౌన్ సీఐగా పోస్టింగ్ తెచ్చుకున్న రాజేంద్రనాథ్ యాదవ్ స్వామిభక్తి ప్రదర్శిస్తూ మహానందరెడ్డిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇది పోలీసుల సాయంతో రాజకీయ కక్ష సాధింపులకు పరాకాష్టగా పలువురు పేర్కొంటున్నారు. మహానందరెడ్డి గత ఎన్నికల్లో దగ్గుపాటికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం కోసం ముమ్మర ప్రచారం సాగించారు. దీంతో ఆయనపై కక్ష పెంచుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి పథకం ప్రకారం సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను రంగంలోకి దింపి కక్ష సాధింపులకు తెరలేపారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బుధవారం మహానందరెడ్డిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు పిలుచుకెళ్లిన పోలీసులు కాసేపటి తర్వాత వదిలేశారు. అంతకు ముందు ఆయన ఇంట్లో విస్తృత సోదాలు చేశారు. ఇలా పది రోజులకోసారి సోదాలు నిర్వహించడం ప్రసన్నాయపల్లిలో కలకలం రేపుతోంది.

యువరైతు బలవన్మరణం

గార్లదిన్నె/అనంతపురం సిటీ: ఆర్థిక సమస్యలు తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన గోపు ఆనంద్‌రెడ్డి(29) తల్లిదండ్రుల మృతి అనంతరం తన అన్న సాయిప్రతాపరెడ్డి కుటుంబంతో కలసి జీవిస్తున్నాడు. డిప్లొమా వరకు చదువుకున్న ఆనందరెడ్డి జేసీబీ పెట్టుకొని, అన్నతో కలసి తమకున్న పొలంలో వివిధ రకాల పంటలు సాగు చేసేవాడు. ఈ క్రమంలో పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాలు మూటగట్టుకున్నాడు. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. అప్పులు తీర్చే మార్గం కానరాక మద్యానికి బానిసైన ఆనందరెడ్డి... మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చేశాడు. అర్ధరాత్రి సమయంలో గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి సమీపంలో పట్టాలపైకి చేరుకుని గూడ్స్ రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ముక్కలైన మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సాయిప్రతాపరెడ్డి మార్చురీకి చేరుకుని మృతుడిని ఆనందరెడ్డిగా ధ్రువీకరించాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పీఎం సూర్యఘర్' వేగవంతం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్: జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలు వేగవంతం కావాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని 45 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 46 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్నింటినీ గ్రౌండింగ్ చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను వెండర్స్ సిద్ధం చేసుకునేలా చూడాలన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ 'పీఎం సూర్యఘర్' అమలులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్, ఈఈలు జేవీ రమేష్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'ఎంఎస్ఎంఈ'లకు భూమి కేటాయించండి

అనంతపురం అర్బన్: 'ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను చేపట్టండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, జిల్లా రిజిస్ట్రార్, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఎస్‌డీటీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ–సేవ, ఆధార్ సీడింగ్, అడంగల్ కరెక్షన్, మ్యుటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ ఉద్యోగుల డైరీ విడుదల



డైరీ ఆవిష్కరిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025 డైరీని జేడీఏ ఉమామహేశ్వరమ్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రైతులకు అందుతున్న ఫలాల్లో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహా సహకారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజేంద్ర ప్రసాద్, ఎస్.బాలాజీనాయక్, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, కార్యదర్శి హెచ్.ఆదంఖాన్, జిల్లా కార్యవర్గం నాయకులు రమణారెడ్డి, ప్రాణేష్ కుమార్, ఎం.రాజగోపాల్, రంగస్వామి, పద్మావతి, వీరేష్, నరసింహా, సల్మార్‌సబీర్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఏఓ సుజాత, డ్రైవర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ మేనేజర్లుగా ఓబుళపతి, శ్రీనివాసులు

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ ఆగ్రోస్ అనంతపురం జిల్లా మేనేజర్‌గా కె.ఓబుళపతి, శ్రీసత్యసాయి జిల్లా మేనేజర్‌గా శ్రీనివాసులును నియమిస్తూ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఓబుళపతి అనంతపురంలోని భూసార సంరక్షణ విభాగం ఏడీగా,. శ్రీనివాసులు హిందూపురంలోని భూసార సంరక్షణా విభాగం ఏడీగా పనిచేస్తున్నారు. ఇరువురూ గతంలో ఏపీ ఆగ్రోస్ మేనేజర్లుగా పనిచేసిన అనుభవం ఉండటంతో తిరిగి మరోసారి వారినే జిల్లా మేనేజర్లుగా నియమించినట్లు తెలిసింది. ప్రస్తుతం వ్యవసాయశాఖ పరిధిలో యాంత్రీకరణ పథకం అమలులోకి రావడంతో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్‌కు బాధ్యతలు అప్పజెప్పడంతో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టులను భర్తీ చేసినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఒకట్రెండు రోజుల్లో వీరిద్దరూ బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.

384 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంగ్లిష్ పేపర్–2 పరీక్షకు జిల్లాలో 384 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 20,094 మందికి గాను 19,755 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,789 మందికి గాను 1,744 మంది హాజరయ్యారు. జిల్లాలోని 45 పరీక్ష కేంద్రాలను ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం. వెంకటరమణనాయక్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, కస్టోడియన్లు పరిశీలించారు.


‘ఉపాధి’లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



మస్టర్ పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవు అని డ్వామా పీడీ సలీం బాషా హెచ్చరించారు. బుధవారం ఆయన దయ్యాలకుంటపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది కూలీలు ఉన్నారు, ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయని ఏపీఓ పోలేరయ్యను అడిగి తెలుసుకున్నారు. బీకేఎస్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారని, జాబ్ కార్డు ఉన్న వారందరూ 150 రోజులు పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు కుళ్లాయస్వామి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు వీడ్కోలు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్ నగర్‌లోని మినర్వా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో అనవసరమైన ఒత్తిళ్లకు గురికా కూడదని తెలిపారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేశారు. పదేళ్ల తర్వాత పాఠశాలను వీడి వెళ్లిపోతుండటం బాధగా ఉందని పదో తరగతి విద్యార్థులు వాపోయారు.

మహిమాన్వితుడు ఎర్రిస్వామి తాత

- అయ్యవారిపల్లిలో నేటి నుంచి 3 రోజుల పాటు జాతర
- విద్యుత్ కాంతుల్లో వెలుగులీనుతున్న ఆలయం
- జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న వేలాది మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ఎర్రిస్వామి తాత ఆలయం



ఎర్రిస్వామి తాత ఆలయ ముఖద్వారం

రాప్తాడు: భక్తుల కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు ఎర్రిస్వామి తాత జాతరకు సర్వం సిద్ధమైంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది జాతర నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అయ్యవారిపల్లి గ్రామం అంతా విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు జారత జరగనుంది. జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. తొలిరోజు గురువారం స్వామి కాపులు ఎర్రిస్వామి తాతకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు ఆలయం వద్ద ఉదయం నుంచి రాత్రి 9 గంటలకు వరకు భక్తులకు అన్నదానం చేస్తారు. రెండో రోజు శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం 4 గంటల నుంచి పన్నారపు బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకుంటారు. అదే రోజు రాత్రి 9 గంటలకు ఆణిముత్యాలు అను ఉచిత నాటకాన్ని ప్రదర్శిస్తారు. మూడో రోజు శనివారం ఎర్రిస్వామి తాత ఆలయం వద్ద ఉదయం 8 గంటలకు దేశవు ఎద్దులతో జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేయనున్నారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం వద్ద ఉట్ల పరుష జరుగుతుంది. ఉట్ల పరుష చూసేందుకు భారీగా ప్రజలు తరలివస్తారు.

ఇదీ ఆలయ చరిత్ర..

ఎర్రిస్వామి తాత అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వీరప్ప, వీరమ్మ అనే దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే తన మహిమలను గ్రామస్తులకు చూపించే వారట. వర్షం వచ్చే విషయం, పంటలు పండే విషయం చెప్పేవారని స్థానికులు చెబుతున్నారు. ఒకే సారి రెండు చోట్ల గ్రామస్తులకు కన్పించేవారని అంటున్నారు. 200 ఏళ్ల కిత్రం ఎర్రిస్వామి తాత గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ భూమిలోనే జీవ సమాధి అవుతానని గ్రామస్తులకు చెప్పి సమాధి అయ్యారని గ్రామస్తులు చెబుతున్నారు. సమాధి అవ్వగానే ఇక్కడ గుడిని నిర్మించాలని చెప్పారట. దీంతో గ్రామస్తులు అప్పట్లో కాల్వ గోంచిగా ఏర్పడి అక్కడ గుడిని నిర్మించారు. ఇక్కడ పూజలు నిర్వహిస్తే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. అలాగే భక్తులు పిల్లలు పుట్టాలని కోరుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. దీంతో ఆలయానికి ప్రతి సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

అంతా ఎర్రమ్మ, ఎర్రిస్వామిలే..

గ్రామస్తులకు ఎర్రిస్వామి తాత అంటే ఎంతో నమ్మకం. ఆచారం ప్రకారం ఎంతో ఇష్టంగా కొలిచే ఎర్రిస్వామి తాత పేరును గ్రామంలో అన్ని వేళల్లో పలుకుతూ ఉండాలనే ధ్యేయంతో గ్రామంలో చాలా మంది ఎర్రిస్వామి, ఎర్రమ్మ అనే పేర్లే పెట్టుకున్నారు. గ్రామంలో అన్ని వర్గాల వారు స్వామి పేర్లు పెట్టుకోవడం విశేషం. 500 కుటుంబాలు ఉన్న గ్రామంలో ప్రతి కుటుంబంలో ఇద్దరి పేర్లు స్వామి వారి పేరొచ్చేలా ఉంటాయి. దీంతో గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డు, రేషన్ కార్డులు, పింఛన్ల జాబితా, పాఠశాల రిజిస్టర్, ఓటర్ల జాబితాలో అధికంగా ఆ పేర్లే కనబడుతూ ఉంటాయి.

ఔను.. అది పూర్తిగా వంక స్థలమే

- వరద వస్తే ఎవరూ కాపాడలేరు
- మూడు రోజుల్లో బండలు తీసేయాలి... లేదంటే పగలకొడతాం
- అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్ కుమార్



తడకలేరు వంక కబ్జాను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోహన్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: ‘నట్టనడి వంకలో ఇంత అధ్వానంగా ఎలా ఆనకట్టలా మట్టిని అడ్డుగా తోలి ఇళ్ల నిర్మాణాలు చేపడతారు? రేపొద్దున వరద వస్తే ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారి పరిస్థితి ఏం కావాలి? తమాషా చేస్తున్నారా? పేదల జీవితాలతో చెలగాటమాడతారా?’ అంటూ అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 89లో ఉన్న తడకలేరు వంకను కబ్జా చేసి ఇళ్ల స్థలాల కోసం బండలు నాటడం, 83–11, 12 సర్వే నంబర్లలో ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఏర్పాటు చేసిన కాలనీలో గుడి కోసం వదిలిన ఓపెన్ స్థలాన్ని కబ్జా చేసి బండలు నాటుతున్న వైనంపై ఈ నెల 4న ‘అధికారం మాదే.. అడిగేవారెవరు?’ శీర్షికతో ‘సాక్షి’లో వెలువడిన కథనంపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో వీఆర్వో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చరణ్‌తో తహసీల్దార్ మోహన్‌కుమార్ బుధవారం ఆక్రమిత ప్రాంతాలను పరిశీలించారు. వంక స్థలాన్ని చూడగానే ఆయన విస్తుపోయారు. ఇంత పెద్ద వంకలో ఇళ్లు ఎలా నిర్మించుకుందాం అనుకుంటున్నారంటూ సీరియస్ అయ్యారు. మూడు రోజుల్లోపు బండలు తొలగించుకోకపోతే తామే రంగంలోకి దిగి బండలన్నీ పగలకొట్టిస్తామని హెచ్చరించారు. సర్వే నంబర్లు 83–11, 12లోని ఓపెన్ సైట్‌ను కబ్జా చేస్తుంటే ఏమి చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులపై మండిపడ్డారు.ఈ అంశంలో ఎవరినీ ఉపేక్షించరాదన్నారు. అందరికీ నోటీసులు జారీ చేసి నాటిన బండలు తొలిగించేలా చూడాలని సూచించారు. స్కెచ్‌లు తీసుకుని సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు నాటించి బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎవరైనా మొండిగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

రైతులను ఆదుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగా అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారనిరైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు ధ్వజమెత్తారు. నష్టాలు, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. అన్ని పంటలకు మద్దతు ధర వెంటనే చెల్లించాలని, పంట రుణాల మాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమితి నాయకులు చిరుతల మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తున్నామన్నారు. రైతుల ఆదాయం పెంచుతామని ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి ధారాదత్తం చేసేందుకు సిద్ధపడ్డారని మండిపడ్డారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాల్లో భాగంగా రైతుల వ్యవసాయ ఫలాలను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందన్నారు. మిర్చి, వేరుశనగ, పప్పుశనగ, పత్తి, తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రాష్ట్రంలో రైతులు నష్టపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేలు చొప్పున మద్దతు ధర అందించాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటుతున్నా... ఒక రబీ, ఒక ఖరీఫ్ వెళ్లిపోయినా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. 50 ఏళ్లు పైబడిన రైతులకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలన్నారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. సాగునీరు, రైతుల సమస్యల పరిష్కారానికి, ప్రాథమిక సహకార సంఘాలను ప్రైవేటీకరించకుండా ఉండేలా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు చంద్రశేఖర్, వన్నారెడ్డి, నాయుడు, రామకృష్ణ, వీకేకృష్ణుడు, ఏసురత్నం, హరికృష్ణ, వీరనారప్ప, నాగప్ప,బాషా, రామాంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరాముడు, చంద్రప్ప, వెంకటేశులు, విశ్వంపాల్గొన్నారు.

గుండెపోటుతో ఉప సర్పంచ్ మృతి

రాప్తాడు: పాలచెర్ల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కుమ్మర నరసింహులు (60) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచు కుమ్మర నరసింహులు వ్యవసాయం, ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం రాత్రి గుండెపోటుకు గురి కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమ్మర నరసింహులు మృతదేహానికి సర్పంచ్ మత్తెల సుభాషిణి, మాజీ సర్పంచులు బండి శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విధుల్లో చేరిన రూరల్ తహసీల్దార్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ మోహన్ కుమార్ బుధవారం విధుల్లో చేరారు. కూతురి వివాహం నేపథ్యంలో 15 రోజుల పాటు సెలవు పెట్టారు. అప్పటి నుంచి అర్బన్ తహసీల్దార్ హరికుమార్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. విధుల్లో చేరిన అనంతరం రూరల్ పరిధిలోని వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు.

వైభవంగా మాధవరాజుల పరుష



అలంకరణలో మాధరాజుల స్వామి

ఆత్మకూరు: సనప గ్రామంలో మాధవరాజుల స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పరుష నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా పూలు, వెండి ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న పురాతన బావిలో నాణేలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు.

సామాజిక స్పృహతోనే జీవితానికి సార్థకత



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. సాటి మానవులతో పాటు పశుపక్ష్యాదుల విషయంలోనూ మానవత్వంతో వ్యవహరించినప్పుడే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ క్యాంపస్‌లో జెడ్పీ తరఫున ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సీజన్ మొదలవడంతో ఎండల తీవ్రత అధికమైందన్నారు. జిల్లా నలుమూలల నుంచి అనంతపురానికి వచ్చే వారి కోసం విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జన సమ్మర్థం కలిగిన ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాహార్తి తీర్చేందుకు జెడ్పీలో శుద్ధి జలంతో కూడిన చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు శ్రీవాణిబాయి, రత్నాబాయి, షబ్బీర్ నియాజ్, విజయభాస్కర్ రెడ్డి, ధనుంజయ, మహబూబ్ వలి, కమ్మ నాగరాజు, ఉషారాణి, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బధిరులకు ‘అమ్మ’ ఆసరా



చిన్నారులకు వినికిడి యంత్రాలను అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ ఇద్దరు బధిర చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపింది. వివరాలు.. నగరంలోని అశోక్ నగర్‌కు చెందిన తిప్పయ్య స్వామి దంపతులు చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి సంతానమైన బబ్లూ, చరణ్ పుట్టుకతోనే బధిరులు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో అమ్మ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన తరిమెల రమణారెడ్డి సాయం అందించేందుకు ముందుకొచ్చారు. చిన్నారులను నగరంలోని ఓ డాక్టర్‌కు చూపించారు. వారు బెంగళూరులోని ఓ ఈఎన్‌టీ కేర్ హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు. దూరభారం వెళ్లలేక ఇబ్బంది పడటంతో తరిమెల రమణారెడ్డి వివిధ రకాల పరీక్షలకు రూ.15 వేలు అందజేశారు. అలాగే 80 శాతం వరకు వినగలిగే రీచార్జబుల్ హియరింగ్ మిషన్స్ (రూ.80 వేలు) అందజేశారు. ఇన్నేళ్లుగా ఒక్క మాట కూడా వినపడని వారికి వినికిడి యంత్రాలు అందజేసిన తరిమెల రమణారెడ్డికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: ఫీజు కట్టలేదనే కారణంతో ఎడిఫై స్కూల్‌లో ఓ విద్యార్థిని బాత్‌రూమ్‌లో కుర్చోపెట్టి పరీక్షలు రాయించడం సరికాదని దళిత, గిరిజన పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాకెట్ల చందు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదరు స్కూల్ యాజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు కట్టకుంటే తల్లిదండ్రులను అడగాలన్నారు. అలా కాకుండా విద్యార్థులను అవమానించడం తగదన్నారు. ఆ స్కూల్ పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలాలపురం గుజ్జల పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి చింతల సురేష్, కట్లురు ఆనంద్ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం

అనంతపురం కల్చరల్: గతానికి భిన్నంగా ఈసారి మరింత వేసవి తీవ్రత ఉంటుంది. చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌కేసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నీలయ్యగారి కమలనాథ్ అన్నారు. ఎన్‌కేసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలతో పాటూ పలు చోట్ల విద్యార్థులకు వాటర్‌బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. ఒత్తిడికి కూడా దూరంగా ఉండాలన్నారు. అలాగే ఈసారి పక్షుల కోసం ప్రత్యేకంగా నగరంలో చాలా చోట్ల ముంతలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కవులు రియాజుద్దీన్, తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై దాడులు అరికట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉమ్మడి జిల్లాలో దివ్యాంగులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కో–ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏడీ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాక్‌లాగ్ పోస్టులు తక్షణం భర్తీ చేయాలన్నారు. అలాగే దివ్యాంగుల కమిటీ హాళ్లకు స్థలాలు కేటాయించాలని కోరారు. దివ్యాంగులపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాకే అంజనేయులు, వసంత కుమార్, రాజేష్, దొనస్వామి, ఉద్దీప్ సింహ, సర్వేష్, ఈశ్వర్, ధనుంజయ, జయన్న, చెన్న మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడు రూరల్: రాచానపల్లి పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు సర్పంచ్ బండా అంజియాదవ్ తెలిపారు. పంచాయతీ పరిధిలోని రామకృష్ణపురం వెనుక ప్రభుత్వ స్థలంలో 40 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్‌ను కోరారు. నిర్మాణం పూర్తయితే ప్రజలకు పీఏబీఆర్ నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

8న జిల్లా స్థాయి వృషభాల బలప్రదర్శన

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వెలసిన ఎర్రిస్వామి తాత ఉట్ల పరుష సందర్భంగా ఈ నెల 8న జిల్లా స్థాయి వృషభాల (దేశవు ఎద్దులు) బలప్రదర్శన నిర్వహించనున్నారు. అయ్యవారిపల్లి కాల్వగోంచి వారి ఆధ్వర్యంలో ఎర్రిస్వామి తాత ఆలయం వద్ద పోటీలు ఉంటాయి. ఈ మేరకు ఆ గ్రామ పెద్దలు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. పూర్తి వివరాలకు 96524 11408, 98850 82915, 83411 49944, 85002 33956లో సంప్రదించవచ్చు.

ఫాగింగ్, స్ప్రేయింగ్ తప్పనిసరి

అనంతపురం మెడికల్: దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. పదిహేను రోజులకు ఒకసారి మేజర్ గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్, తదితర యాంటీ లార్వా పద్ధతులను పాటించాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఓలు కే గిరిధర్ రెడ్డి, రామాంజనేయులు, కోదండరామిరెడ్డి, తిరుపాల్, జయరాం నాయక్, శివయ్య, మద్దయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవేంద్ర రెడ్డి, రమేష్, లోకేశ్వర్ రెడ్డి, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



తహసీల్దార్ హరికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దార్ కారాలయం వద్ద భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ ఆలం మాట్లాడుతూ.. పేదలకు బియ్యం సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పనులు వదలుకుని గంటల తరబడి స్టోర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అడిగితే సంబంధం లేని కారణాలు చెబుతూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఒకట్రెండు రోజులు పంపిణీ చేసి నోస్టాక్ బోర్డు పెడుతున్నారంటూ మండిపడ్డారు. రేషన్ బియ్యం పంపిణీలో సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ హరికుమార్‌కు వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. కార్యక్రమంలో నాయకులు శేషు, లోకేష్, గంగమ్మ, పద్మ, లక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.